పారిశుధ్యం నిల్.. జ్వరాలు వైరల్



పాపినేనిపల్లిలో సీసీ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు



అంకభూపాలెంలో అంతర్గత సీసీ రోడ్లపై నిలిచిన మురుగు



యాచవరం పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన బాధితులు



అంకభూపాలెం యాదవబజారులో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

గర్ధవీడు:

వాతవరణంలో మార్పులు, పారిశుధ్య లోపం కారణంగా అర్ధవీడు మండలంలోని పలు గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. అర్ధవీడు, యాచవరం పీహెచ్‌సీలకు జ్వరాల బాధితులు క్యూకడుతున్నారు. అధిక సంఖ్యలో జ్వర పీడితులు కంభం, మార్కాపురం, ఒంగోలు, చైన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పీహెచ్‌సీలకు రోజూ 80 నుంచి 120 రోగులు వస్తుండగా వీరిలో వైరల్, చికున్‌గున్యా జ్వరాలతో బాధపడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోకపోవడంతో దోమలు విజృంభించి జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్లపైనే మురుగు

లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు మురుగు కూపాలను తలపిస్తున్నాయి. రోడ్లపై హెచ్చుతగ్గులు ఉండటం, సైడు కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి సైతం నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. పాపినేనిపల్లి బస్టాండ్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సీసీ రోడ్డు, అంకభూపాలెంలోని పాత మరుగుదొడ్ల ఎదురు సీసీ రోడ్డు, యాదవ బజారు సీసీ రోడ్డుపై వర్షం నీరు రోజుల తరబడి నిలిచి మురుగుమయంగా మారాయి. ఆయా రోడ్లలో మురుగులో గుండా వెళ్లలేక పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా యాతన పడుతున్నారు.

పందుల స్వైర విహారం

అర్ధవీడు మండలంలోని చౌటపాలెంలో పారిశుధ్యం లోపించి వీధులు అపరిశుభ్రంగా మారిపోయాయి. పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ నివాసాల్లోకి వస్తున్నాయి. కచ్చా డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవడంతోపాటు చిల్లచెట్లు పెరిగిపోవడంతో మురుగు ముందుకు కదలడంలేదు.

గ్రామాల్లో పారిశుధ్య లోపంపై ఎంపీడీఓ కె.వీరరాజును వివరణ కోరగా.. వీధుల్లో పందులు సంచరించకుండా వాటి యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జ్వర పీడితుల కేసులు పెరుగుతుండటంపై అర్ధవీడు పీహెచ్‌సీ వైద్యురాలు అనూరాధను వివరణ కోరగా.. «గ్రామాల్లో ఫీవర్ సర్వే చేస్తున్నాం. జ్వరం, జలుబు, ఒళ్లనొప్పులతో రోజూ సుమారు 120 మంది వస్తున్నారు. తగిన వైద్య సేవలు అందిస్తున్నాం» అని తెలిపారు.





చౌటపాలెంలో నివాస గృహాల మధ్య, పీవీ పాఠశాల పక్కన సంచరిస్తున్న పందులు

శానిటేషన్ వర్కర్లపై వేధింపులు ఆపాలి

గిద్దలూరు రూరల్: శానిటేషన్ కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకుడు నరసింహులు డిమాండ్ చేశారు. మండలంలోని ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శానిటేషన్ వర్కర్ ఎస్‌కే షాబీరాను అక్రమంగా తొలగించడాన్ని అడ్డుకోవాలని కోరుతూ గురువారం ఎంఈఓ నాగభూషణ్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని కొన్ని పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్లను తొలగించాలని అధికార పార్టీ నేతలు యత్నిస్తున్నారని, నీచ రాజకీయాలకు ఉన్నతాధికారులు సహకరించొద్దని కోరారు. శానిటేషన్ వర్కర్లపై వేధింపులు ఆపకపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో శానిటేషన వర్కర్లు మేరీకుమారి, జైరాబీ, తైరూన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, బాధితురాలు

వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా గొంగటి విష్ణువర్ధన్‌రెడ్డి



గొంగటి విష్ణువర్ధన్‌రెడ్డి

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన గొంగటి విష్ణువర్ధన్ రెడ్డి వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. తనకు పదవి దక్కేందుకు కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఐటీ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ సునీల్, ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అటవీశాఖ అమరవీరులు చిరస్మరణీయులు



అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: అటవీశాఖ అమరవీరులు ఎప్పటికీ చిరస్మరణీయులని డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి పేర్కొన్నారు. జాతీయ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడవులను సంరక్షించడంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన ఉద్యోగులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అడవులను రక్షించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ మధుప్రియ, డీఆర్‌ఓలు రంగారెడ్డి, వంశీకృష్ణ, ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

13న విజయవాడలో ఏపీ బీసీ జేఏసీ సదస్సు

మార్కాపురం: ఏపీ బీసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, సచివాలయ ఉద్యోగుల, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 13న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.రంగనాయకులు, శివపూర్ణయ్య, ఉపాధ్యక్షుడు నల్లబోతుల శ్రీనివాసులు, సెక్రటరీ బాలయ్య గురువారం తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ బీసీలకు వర్తింపజేయాలని, క్రీమీలేయర్ విధానాన్ని బీసీలకు రద్దు చేయాలని, ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీ బిల్లు పెట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్లపై సదస్సులో చర్చించనున్నట్లు వివరించారు. సమావేశానికి బీసీ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



టేబుల్, కుర్చీలు పంపిణీ చేస్తున్న దాతలు

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి తల్లులు టేబుల్, కుర్చీలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ కె.కుమారి మాట్లాడుతూ.. ప్రీస్కూల్ పిల్లల కోసం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం తల్లులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని కార్యకర్త షేక్ షంషాద్‌బీకి సూచించారు.

మార్కాపురంలో సైనిక్ కాలనీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న చిన్నయ్య

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మాజీ సైనికుల కోసం సైనిక్ కాలనీ ఏర్పాటు చేయాలని హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ సొసైటీ కమిటీ ప్రెసిడెంట్ ఎం చిన్నయ్య, జై జవాన్ అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మాజీ సైనిక ఉద్యోగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంలో మాజీ సైనికులు వేల సంఖ్యలో ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులు, వారి కుటుంబ సభ్యులు, మాజీ సైనికుల సంక్షేమంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఈనెల 13న మార్కాపురంలో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి మాజీ సైనికులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శేషసాయి, నారాయణరెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత ప్రధాని నరేంద్రమోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు జేవీ నారాయణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ కె.సురేష్‌కు ఫిర్యాదు చేశారు. రాహుల్‌గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మట్టిమల్ల పుల్లయ్య, గుమ్మారాముడు, శ్రీనివాసులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లో తనిఖీకి పురుగు మందులు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్, పక్కన అధికారులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఒక ఫెర్టిలైజర్ దుకాణంలో అమ్ముతున్న పురుగుమందు డబ్బాలను పరీక్షల నిమిత్తం అమరావతిలోని ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వివిధ ఎరువులు, పురుగుమందుల షాపులను ఏఓ బుజ్జిబాయితో కలిసి తనిఖీ చేశారు. ఎవరైనా నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతుకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందు అమ్మిన వెంటనే రశీదు ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీల్లో తర్లుపాడు ఏఓ జ్యోత్స్నదేవి, టెక్నికల్ ఏఓ ప్రసన్న రంగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా మండలంలోని రెడ్డిచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల రెడ్డిచెర్ల, బ్రాహ్మణపల్లె, మూలపల్లె, మల్లారెడ్డిపల్లె, పామూరుపల్లె, గోనపల్లె, భావాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ శ్రీనివాసులు తెలిపారు. అలాగే రాజుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజుపాలెం, ద్వారకచర్ల, వెంకటాపురం, ముక్తాపురం, వెన్నంపల్లె, పాయలపల్లె, గుంతపల్లె గ్రామాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కసినేపల్లె గ్రామంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు.

దరిమడుగులో కుక్కల బెడద



మార్కాపురంలో గుంపుగా సంచరిస్తున్న వీధి శునకాలు

మార్కాపురం: మండలంలోని దరిమడుగు, వేములకోట, కొట్టాలపల్లి, చింతగుంట్ల, బోడపాడు తదితర గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు రోడ్డు మీద వెళ్లే పాదచారులతోపాటు ద్విచక్ర వాహనదారులను వెంటపడి కరుస్తున్నాయి. ఇటీవల వేములకోట, దరిమడుగు గ్రామాల్లో పలువురు కుక్కల దాడిలో గాయపడ్డారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను రాత్రిపూట పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల ప్రాంతాల్లో వదిలివెళ్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం మున్సిపాలిటీలోనూ వీధి కుక్కల బెడద ఇటీవల కాలంలో తీవ్రమైంది. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కుక్కలను పట్టుకున్నారు. అయినప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి వదిలివెళ్తున్న శునకాలతో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. శునకాల బెడదతో బిక్కుబిక్కుమంటున్న పట్టణ ప్రజలను కోతుల బెడద మరింత వేధిస్తోంది. ఇళ్లలోకి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్న కోతులను కట్టడి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.